
# ఫ్లాష్ బ్యాక్




పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## రచయిత – రాజశ్రీ

## (1973 అక్టోబర్, విజయచిత్ర నుంచి పునర్ముద్రణ)

**ఇరవై సంవత్సరాల క్రితం** శ్రీకాకుళం జిల్లా బోర్డ్ ఆఫీసులో ఇందుకూరి రామకృష్ణ రాజు అనే అబ్బాయి టైపిస్ట్‌గా పనిచేస్తూ ఉండేవాడు. ఉత్తరాలు, ఆఫీసు సమాచారం – వేళ్ళు టైప్ చేస్తూనే వున్నా, మనసులోని ఆలోచనా తరంగాలు మాత్రం కథల మీద, గేయాల మీదా, నాటకాల మీదా దూకుతూ వుండేవి. అప్పటికే అతని కొన్ని గేయాలు పత్రికల్లో అచ్చయినాయి. కొన్ని అచ్చుకానివి కూడా వున్నాయి. పేరు 'పొడుగ్గావుందే' అనిపించో, ప్రభుత్వోద్యోగి కావడం వల్లనో, మరే కారణం చేతనో 'రాజశ్రీ' అని కలం పేరు పెట్టుకున్నాడు. పద్యాలు రాయడం మీదికి మనసు మళ్ళింది. మనసుతోపాటు తనూ మళ్ళాడు. పద్యాలు రాయడం ఆరంభించాడు. కాలేజీలో చేరిన తర్వాత తెలుగు



లెక్చరర్ కొత్తపల్లి వీరభద్రరావుగారి సహాయంతో, కాలేజి పత్రికలో కొన్ని పద్యాలు రాశాడు. గేయాలు అల్లాడు. అప్పుడు లభించిన ప్రోత్సాహంతో అతను ఏదో ఒకటి రాస్తూనే వచ్చాడు. విజయనగరం మహారాజా వారి కాలేజీలో మహారాజావారి స్కాలర్‌షిప్‌తోనే, రామకృష్ణరాజు బి.యస్‌సి వరకూ చదివాడు. ఎందుకైనా మంచిదని రైటింగ్‌తోపాటు టైప్‌రైటింగ్ కూడా నేర్చుకోగా, అప్పటికి అదే ఉపాధి కల్పించింది. అయితే, ఆ ఉద్యోగంలో, ఆ ఆఫీసు జీవితంలో అతనికి

తృప్తి కనిపించలేదు. సృజనాత్మకంగా ఏవైనా ప్రయోగాలు చెయ్యాలన్న తపన హెచ్చింది. ఉద్యోగంలో వుంటూనే 'అభ్యుదయం' అనే ఖండకావ్యం రాశాడు. అందులో సగం పద్య రూపంలోనూ సగం గేయ రూపంలోనూ రచనలు చేశాడు. పద్యాలు రాయడంలో కరుణశ్రీనీ, గేయాలు రాయడంలో శ్రీశ్రీనీ గురువులుగా భావించి, వాళ్ళ దారుల్లో నడవడానికి కృషి చేశాడు.

రాజశ్రీ రాసిన తొలినాటకం 'ఆంధ్రశ్రీ'. ఈ నాటకం విశాఖ పట్నంలో ప్రదర్శింపబడినప్పుడు, రాజశ్రీ ఎన్నో అభినందనలు అందుకున్నాడు. ఆ అభినందనలతోపాటు నేటి చిత్ర దర్శకుడు బి.వి ప్రసాద్ స్నేహం కూడా లభ్యమైంది. బి.వి.ప్రసాద్ స్వతహాగా నాటక రంగం మీద మంచి నటుడు కావడంవల్ల, ఆయన సలహాలూ, సూచనలూ రాజశ్రీకి లభించాయి. మంచి నాటకాలు రాయాలన్న కోరిక ఎక్కువైంది. ఆ కోరికే అతనిచేత 'వదిన' 'బావ' అనే నాటకాలు రాయించింది. బి.వి ప్రసాద్ ఈ నాటకాల్లో నటించడమే కాకుండా, ఆ ప్రదర్శనలకు దర్శకత్వం కూడా వహించారు. ఆ నాటకాలు అనేక నాటక పోటీలలో ప్రదర్శింపబడి, 'రాజశ్రీ – ప్రసాద్' జంటకు మెప్పులూ, కప్పులూ ప్రసాదించాయి.

రెండేళ్ళు ఉద్యోగంలో వుండి రాజశ్రీ ఆ ఉద్యోగం మానేశాడు. కేవలం ఒక రచయితగా జర్నలిస్ట్‌గా బతకాలనుకున్నాడు. అతను రాసిన గేయాలను వార పత్రికలు, మాస పత్రికలూ అచ్చు వేశాయి. నాటకాలు పలు నాటక సంస్థలు ప్రదర్శించాయి. మరికొన్ని సంస్థలు ఇతర నాటకాల్లో అతనిచేత పాటలు రాయించుకున్నాయి. అమెచూర్ నాటక సంస్థలకు, సారస్వతాభిమానులకూ రాజశ్రీ బాగా తెలిశాడు.

1955లో అదృష్టదేవత రాజశ్రీని వెతుక్కుంటూ, శ్రీకాకుళం వెళ్ళి అతన్ని మద్రాసు తీసుకొచ్చి విడిచిపెట్టింది. తొలి రోజుల్లో ఆ దేవత, అతని దీక్షను పరీక్షిస్తూ నిరీక్షించినా, కొన్నాళ్ళకు అతనే గెలిచాడని తన ఎన్నిక, అంచనా వృధా కావని, సగర్వంగా నవ్వుకున్నది.

అయితే, రాజశ్రీ కేవలం తన అదృష్టాన్నే నమ్ముకుని మద్రాసులో దిగలేదు. ఉన్న శక్తి సామర్ధ్యాలతో కృషి చేస్తూ, అదృష్టదేవత ఆశీర్వచనం కూడా కాంక్షించాడు.

ప్రసిద్ధ రచయిత పినిశెట్టి శ్రీరామమూర్తిగారి ద్వారా రాజశ్రీకి సినిమాల్లో పాదం పెట్టే అవకాశం కలిగింది. 'ఆడపెత్తనం' చిత్రంలో "ఒకటి రెండు మూడు ...ప్రేమకు అర్ధం తెలియాలంటే పెళ్ళి చేసుకుని చూడు..." అన్న పాట రాశాడు. తన తొలి పాటకు ప్రఖ్యాత సంగీత దర్శకుడు రాజేశ్వరరావు వరస కలిపిస్తూ వుంటే, సరసన వున్న రాజశ్రీ ఉబ్బితబ్బిబ్బయిపోయాడు.

సినిమాల్లో వరసగా పాటలు రావడం అన్నది అంత సులభమైన అవకాశం కాదు. అందుకని, బ్రతుకు గడవడానికి, అనుభవం కలగడానికి దర్శకత్వశాఖలో చేరాడు. ఆడపెత్తనం, అన్న – తమ్ముడు, పరువు ప్రతిష్ట, శాంత, నిత్యకల్యాణం

పచ్చతోరణం, వీర భాస్కరుడు, శ్రీకృష్ణమాయ మొదలైన చిత్రాలకు పలువురు దర్శకుల దగ్గర పనిచేశాడు. పినిశెట్టిగారి ప్రోత్సాహంతో 'నిత్యకల్యాణం పచ్చతోరణం' చిత్రానికి కథ, కథన విభాగాల్లో కూడా పాల్గొనే అవకాశం కలిగింది.

ఇంకో విశేషం ఏం జరిగిందంటే – ఆ చిత్రం క్లైమాక్స్ దృశ్యాలు జరుగుతున్నప్పుడు, ప్రసిద్ధ దర్శక నిర్మాత యల్.వి.ప్రసాద్‌గారు ఆ దృశ్యాల చిత్రీకరణను పర్యవేక్షించారు. ఆ సందర్భంలో ఆయనతో రాజశ్రీకి పరిచయం ఏర్పడింది. రాజశ్రీ, కథా చర్చలోనూ సెట్టుమీదా పనిచెయడం చూసి, పినిశెట్టిగారి సలహా మీద ప్రసాద్‌గారు, రాజశ్రీని తన సంస్థలోకి తీసుకున్నారు. ప్రసాద్ ప్రొడక్షన్స్‌లో రాజశ్రీ 'కథావిభాగం 'లో పనిచేశాడు. సుసురాల్, ఖిలోనా, తాయిల్లా పిళ్ళై మొదలైన చిత్ర కథా చర్చలలో అతను పాల్గొన్నాడు. ఆ సమయంలోనే, రాజశ్రీ మిత్రుడు బి.వి.ప్రసాద్ కూడా ప్రసాద్‌గారి సంస్థలో చేరాడు.

ఆ సంస్థలో వుంటూనే రాజశ్రీ 'రమాసుందరి' మొదలైన చిత్రాల్లో పాటలు కూడా రాశాడు. అప్పట్లోనే హెచ్. ఎమ్.వి కొలంబియా గ్రామఫోను కంపెనీలు రికార్డులకోసం అతనిచేత కొన్ని పాటలు రాయించాయి. పి.సుశీల, యస్. జానకి, పి.బి.శ్రీనివాస్ మున్నగువారు ఆ పాటలు పాడారు.

రాజశ్రీకి తొలిసారిగా మాటలు, పాటలు రాసే అవకాశం కలగడం – 'సింహాచల క్షేత్ర మహిమ'తో. ఈ చిత్రానికి దర్శకుడు బి.వి ప్రసాద్. ప్రసాద్ ద్వారా, ఆ చిత్ర నిర్మాతలు రాజశ్రీకి పరిచయం కావడం, అవకాశం కలగచెయ్యడం జరిగాయి. ఆ చిత్రం నిర్మాణంలో వుండగా, సంగీత దర్శకుడు యమ్.యస్ శ్రీరామ్ –' మూఢ నమ్మకాలు' అనే అనువాద చిత్రాన్ని తయారు చేస్తూ రాజశ్రీ చేత మాటలు, పాటలూ రాయించారు. 'సింహాచల క్షేత్ర మహిమ' కంటె ముందుగా ఈ చిత్రమే విడుదలైంది.

రాజశ్రీ ఆ తర్వాత ఎక్కువగా అనువాద చిత్రాలకు మాటలు రాయసాగాడు. అతను తయారు చేసిన కొన్ని కథలు తమిళంలో చిత్రాలుగా వచ్చాయి. తెలుగులో 'బంగారు గాజులు' చిత్రానికి కథ రూపొందించగా, 68లో ఆ కథకు ఉత్తమ కథగా ద్వితీయ శ్రేణిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బహుమానం లభించింది.

రచయితగా స్థానం సంపాయించుకున్న తర్వాత, రాజశ్రీకి ప్రసిద్ధ నటుడు, నిర్మాత చలం మైత్రి లభించింది. రాజశ్రీ మంచి చిత్రాలను రాయడానికి, అతని సామర్థ్యం తెలిసి రావడానికీ ఆ మైత్రి చాలా కారణమైంది.

ఇంతవరకూ రాజశ్రీ – సింహాచల క్షేత్రమహిమ, పెళ్ళిరోజు, ఎవరు మొనగాడు, సంబరాల రాంబాబు, యమలోకపు గూఢచారి, మట్టిలో మాణిక్యం, నేనూ మనిషినే, కలెక్టర్ జానకి, బస్తీ కిలాడీలు, బుల్లెమ్మ – బుల్లోడు, ఊరికి ఉపకారి, కోడలు పిల్ల, శభాష్ వదిన, మా యిలవేల్పు, తారాశశాంకం, దేవుడమ్మ, మాతృమూర్తి, రాముడే దేవుడు, పసి హృదయాలు మొదలైన చిత్రాలకు మాటలు రాశాడు. మాటలు రాసిన ప్రతి చిత్రంలోనూ ఒకటో రెండో పాటలు కూడా

రాశాడు. మట్టిలో మాణిక్యం, బస్తీ కిలాడీలు, దేవుడమ్మ చిత్రాలకు కథలు కూడా కల్పించాడు. ఈ చిత్రాలతోపాటు 30 అనువాద చిత్రాలు కూడా అతని 'చిత్రాల జాబితా'లోకి వస్తాయి.

ఇవాళ రాజశ్రీ – జెమినీవారి 'కన్నవారి కలలు' రమణచిత్ర 'తులాభారం' డాల్టన్ వారి చిత్రం, చేతన వారి 'గీత', రామకృష్ణా పిక్చర్స్ వారి చిత్రాలకు రచన చేస్తున్నారు.

"అఖిల భారత స్థాయిలో నేను రాసిన సినిమా కథకు ఉత్తమ బహుమతి రావాలి. ఇది ఆశో దురాశో నాకు తెలీదు గాని నా అభిలాష. చలంగారికి నేను 'మంచినీళ్ళ మంగయ్య' అన్న కథ రాసి ఇచ్చాను. అది చిత్ర రూపం ధరించిన నాడు నా ఆశ నెరవేరగలదన్న ఆశ నాకు కచ్చితంగా వున్నది.

ఇవాళ, మలయాళం, బెంగాలి, కొంతవరకూ కన్నడం చిత్రాల కథలలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. జీవితంలో తటస్తపడిన ఏ చిన్న సంఘటనో తీసుకుని, వాళ్ళు కథగా తయారు చేసి చిత్రంగా తీసి ఆర్థిక విజయాలు కూడా సాధిస్తున్నారు. ఇలాంటి కథలు గల చిత్రాలు అయితే, నిర్మాణం కూడా తేలిక. ఖర్చూ తక్కువ. అయితే ఇలాంటి చిత్రాలను తీసేటప్పుడు ఆ గొప్పతనం 'కథ' లో వుండదు. 'కథనం'లోనే వుంటుంది. తెరమీద చిత్రం చూసిన తర్వాత, "కథ ఏమిటి?" అన్నది కాదు ప్రశ్న" "కథను ఎలా చెప్పగలిగాడు" అన్నదే ప్రశ్న." అంటారు రాజశ్రీ.

Post your comments